నేటి నుంచి విధుల్లోకి నూతన ఉపాధ్యాయులు

● 256 మందికి నియామక ఉత్తర్వులు



నూతన టీచర్లతో మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్ రెడ్డి తదితరులు



కలెక్టర్ కార్యాలయం బయట అభ్యర్థులు

సిద్దిపేట, సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో డీఎస్సీ-2024 ద్వారా ఎంపికైన అభ్యర్థులకు ఎట్టకేలకు కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయింది. సిద్దిపేట కలెక్టరేట్ సమావేశ మందిరం వేదికగా మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రక్రియ గంటన్నర ఆలస్యమైంది. కౌన్సెలింగ్ వాయిదా పడిందంటూ ఉదయం 9 గంటలకు రాష్ట్ర విద్యా శాఖ నుంచి సందేశం వెళ్లడంతో అప్పటికే చేరుకున్న అభ్యర్థులు ఒకింత ఆందోళన గురయ్యారు. సమూహాలుగా చేరి చర్చించుకున్నారు. 11.30 గంటలకు కౌన్సెలింగ్ కొనసాగించాలంటూ జిల్లా విద్యా శాఖకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో ప్రక్రియ ఆరంభించారు. ఎస్ఏ (తెలుగు, ఉర్దూ మాధ్యమం), ఎస్‌జీటీ (ఉర్దూ), ఎల్‌పీ (తెలుగు, హిందీ), పీఈటీ, పీడీలకు, ఎస్‌జీటీ (తెలుగు మాధ్యమం) పోస్టులకు అధికారులు ఐచ్ఛిక దరఖాస్తు(ఆప్షన్ ఫారం) అందించగా పూరించారు. ర్యాంకు ఆధారంగా ఎంపికున్న పాఠశాలలకు కేటాయించారు. ఆ వెంటనే నియామక ఉత్తర్వులను డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. 258 మందికి 256 మంది హాజరయ్యారు. వీరు బుధవారం నుంచి విధుల్లో చేరనున్నారు. ఏడీ వెంకటేశ్వర్ రెడ్డి, ప్రణాళిక విభాగం అధికారి రామస్వామి, జిల్లా గణాంక అధికారి నర్సింలు, ఎస్‌వో, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. అభ్యర్థులతో పాటు కుటుంబ సభ్యులు కలెక్టరేట్‌కు తరలిరావడంతో సందడిగా మారింది.

హరిత కొండకు గాయం

మట్టి తవ్వకాలతో పర్యావరణానికి నష్టం



మట్టి తవ్వకాల తర్వాత ఓ వైపు గుట్ట ఇలా..

న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం: పచ్చనిచెట్లతో కళకళలాడుతున్న హుస్నాబాద్ మండలం నాగారం పరిధిలోని పెద్ద గుట్టను జాతీయ రహదారి పనుల కోసం పిండి చేస్తున్నారు. పెద్ద పెద్ద యంత్రాలతో మట్టిని తవ్వి టిప్పర్లలో తరలిస్తున్నారు. గత కొద్ది రోజులుగా ఈ తంతు కొనసాగుతుండటంతో గుట్ట కరిగిపోతోంది. పెద్ద, చిన్నవి అనే తేడా లేకుండా చెట్లన్నీ నేలకూలుతున్నాయి. దీంతో పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఈ గుట్ట కిందనే ఉన్న కుంటలో నిండా నీరుంది. ఓ వైపు పర్యావరణ పరిరక్షణకు వనమహోత్సవం పేరిట మొక్కలు నాటుతుంటే ఇక్కడ మాత్రం మట్టి తవ్వకాలతో కొన్నేళ్లుగా పెరిగిన చెట్లను నేలకూల్చుతున్నారు. ఓ వైపు పూర్తిగా తవ్వగా ఇప్పుడు మరో వైపు మొదలుపెట్టారు. పర్యావరణానికి హాని కలిగించే చర్యలను నిలిపివేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై హుస్నాబాద్ తహసీల్దార్ రవీందర్‌రెడ్డిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా రోడ్డు పనుల కోసం అనుమతులు తీసుకున్నారన్నారు. దీనిపై కొందరు గ్రామస్థులు మంగళవారం తమకు ఫిర్యాదు చేశారన్నారు. మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

సన్నాలకు బోనస్.. మొక్కజొన్నకు డిమాండు

● పంటలకు మద్దతు ధర పెంపు



మక్కలను సంచుల్లో నింపుతున్న రైతులు

న్యూస్‌టుడే, గజ్వేల్, సిద్దిపేట

ప్రైవేటు విపణిలో పంటల ధరలు క్షీణదశకు చేరుకుంటున్న వేళ సర్కారు ప్రకటించిన మద్దతు ధరలు రైతులకు దన్నుగా నిలుస్తున్నాయి. జిల్లాలో రైతులు ప్రధానంగా పత్తి, ధాన్యం, మొక్కజొన్న తదితర పంటలు పండిస్తారు. వీటికి గతేడాదితో పోల్చితే మద్దతు ధరలు పెంచడంతో లాభాలు గడించే అవకాశముంది.

జిల్లాలో ఈ సీజన్‌లో రైతులు మొత్తం 3.68 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో 66,000 ఎకరాల్లో సన్న రకం వేశారు. వీటికి అదనంగా క్వింటాకు రూ.500 చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో రైతులు దళారులకు అమ్ముకోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకుంటే మద్దతు ధర పొందడంతో పాటు అదనంగా బోనస్ అందనుంది. సీజన్‌లో 15.84 లక్షల క్వింటాళ్లు దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన రైతులకు రూ.79.20 కోట్లు బోనస్ రూపంలో చేతికందనుంది. క్వింటాలుకు పెంచిన మద్దతు రూ.117. దీంతో గతేడాదింటే ఈ సారి రూ.94.72 కోట్లు అదనంగా లబ్ధి చేకూరనుంది.

తెల్లబంగారానికి సైతం..

పత్తి 1.08 లక్షల ఎకరాల్లో సాగైంది. 15 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. ఇప్పుడిప్పుడే విపణికి రావటం మొదలైంది. వారం రోజుల్లో పుంజుకోనుంది. అప్పటిలోపు సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే ఫలితం ఉంటుంది. ప్రభుత్వం ఈసారి గతంలో కంటే క్వింటాకు రూ.501 పెంచటంతో మద్దతు ధర రూ.7521కి చేరింది. రైతులు సీసీఐ కేంద్రాల్లోనే విక్రయిస్తే ఈసారి రూ.75.15 కోట్ల లబ్ధి చేకూరనుంది.

మక్కలకు అధిక ధర

ప్రస్తుతం మొక్కజొన్నకు డిమాండు ఉంది. ప్రైవేటులోనే అధిక ధర ఉంది. క్వింటాకు రూ.2500 వరకు అమ్ముడతున్నాయి. ఈసారి జిల్లాలో 26028 ఎకరాల్లో సాగు చేశారు. ఎకరాకు 20 క్వింటాళ్ల మేర దిగుబడి రానుంది. క్వింటాకు రూ.2225 ప్రకటించింది. ఇది గతం కంటే రూ.135 ఎక్కువ. సర్కారు కేంద్రాల్లో విక్రయిస్తే రూ.35,13,780 అదనంగా రానుంది. అయితే ప్రస్తుతం ప్రైవేటు విపణిలో ధర ఎక్కువగా ఉండటంతో రైతులు అటువైపే వెళ్తున్నారు.

గతేడాది, ప్రస్తుతం పంటలకు (క్వింటా) మద్దతు ధరలు ఇలా..

పంట	2023-24	2024-25	పెంపు
వరి(సాధారణం)	2183	2300	117
వరి ఏ గ్రేడు	2203	2320	117
మొక్కజొన్నలు	2090	2225	135
పత్తి మధ్యరకం	6620	7121	501
పత్తి పొడవురకం	7020	7521	501

దుర్గామాత ఆశీస్సులు ఉండాలి



శోభాయాత్రలో ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: అమ్మవారి దయతో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో అసోసియేషన్ల ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత విగ్రహాలను నిర్వాహకులు శోభాయాత్ర ద్వారా మంగళవారం గంగమ్మ ఒడికి తరలించారు. అంబేడ్కర్‌నగర్‌లోని పంచముఖి ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో కొనసాగిన శోభాయాత్రలో కళాకారుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో భారాస పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, నాయకులు కనకరాజు, సాయిరాం, వేణుగోపాల్‌రెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్ రవీందర్, శేఖర్, రమేశ్ పాల్గొన్నారు.

బోగస్ మాటలు ఆపి బోనస్ ఇవ్వాలి: వొడితల

హుస్నాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం బోగస్ మాటలు ఆపి రైతుల ధాన్యానికి బోనస్ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ డిమాండ్ చేశారు. వరి కోతలు మొదలైనప్పటికీ ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదన్నారు. నాట్లు వేయడానికి ముందు ఇవ్వాల్సిన రైతుభరోసా కోతలు వచ్చినా ఇవ్వలేదని ఒక ప్రకటనలో ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడానికి వచ్చే మంత్రిని, కాంగ్రెస్ నాయకులను రైతులు నిలదీయాలన్నారు. అధికారంలోకి వచ్చి పది నెలలు కావొస్తున్నా పెట్టుబడి సాయం ఇవ్వలేదన్నారు. వరదల్లో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల పరిహారం చెల్లించాలన్నారు. రైతులు అధైర్యపడొద్దని, భారాస అండగా ఉంటుందన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి



మంత్రి ప్రభాకర్‌కు సమస్యలు వివరిస్తున్న నాయకులు

చేర్యాల, న్యూస్‌టుడే: గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, ప్రగతి పనులకు నిధులు మంజూరు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరినట్లు కొమురవెల్లి మండలం ఐనాపూర్ మాజీ సర్పంచి చెరుకు రమణారెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు చెప్పారు. మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లం బాలయ్య, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

సంత నిండా సీతాఫలాలే



సీతాఫలాలు చూడగానే నోరూరని వారు ఉండరు. సీజన్ రావడంతోనే సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చెరువు పక్కన సంత పెడుతుంటారు. చుట్టుపక్కల గ్రామాల వారు పెద్దమొత్తంలో కాయలను తీసుకొచ్చి ఒక్కో గంపను రూ.300 నుంచి రూ.400ల వరకు విక్రయిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతమంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడిగా ఉంటోంది. ఇక్కడి నుంచే హైదరాబాద్, బెంగళూరు వంటి వివిధ ప్రాంతాలకు తరలిస్తారు.

-న్యూస్‌టుడే, సిద్దిపేట అర్బన్

పడకేసిన పారిశుద్ధ్యం

● క్షేత్రస్థాయిలో కరవైన పర్యవేక్షణ

న్యూస్‌టుడే, గజ్వేల్



ప్రజ్ఞాపూర్ బస్టాండు వద్ద వ్యర్థాలతో మురుగు కాల్వ

గజ్వేల్-ప్రజ్ఞాపూర్(జీపీ) బల్దియాలో పారిశుద్ధ్య నిర్వహణ గాడి తప్పింది. వార్డుల్లోని మురుగు కాల్వలు వ్యర్థాలతో నిండిపోయాయి. దుర్వాసన, దోమలతో వేగలేకపోతున్నాయని, ఫలితంగా రోగాల బారిన పడుతున్నామని పట్టణవాసులు వాపోతున్నారు.

బల్దియా పారిశుద్ధ్య కార్మికుల్లో కొందరు రోడ్లు ఊడుస్తుండగా మరికొందరు మురుగు కాల్వలు తీస్తుంటారు. వీరిని సమన్వయం చేసుకుని పనులు చేయించటంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. గజ్వేల్‌లోని బీడీ కాలనీ, కోర్టు సమీపంలో, పాత ప్రభుత్వాస్పత్రి వెనక భాగం, తూప్రాన్ రోడ్డు, జాలిగామ బైపాస్‌రోడ్డు, పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలో, ప్రజ్ఞాపూర్ బస్టాండు, ప్రధాన రహదారికి రెండు వైపులా ఉన్న మురుగు కాల్వలు పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయాయి. చాలా రోజులుగా వాటిని శుభ్రం చేయటం లేదని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కరవైందని పట్టణవాసులు చెబుతున్నారు.

చెత్త సేకరణ అంతంతే..

ఇళ్ల నుంచి చెత్త సేకరణ శతశాతం చేస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఇళ్లలో నిల్వ చేసుకోలేక బయట పారబోస్తున్నారు. కొందరు సంచుల్లో నింపి రోడ్ల వెంబడి పడేస్తున్నారు. తూప్రాన్ రోడ్డు, ప్రజ్ఞాపూర్ ప్రధాన రహదారి, కోదండరాంపల్లి కాలనీల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. వారంలో ఐదు రోజులు తడి చెత్త, రెండు రోజులు పొడి చెత్త సేకరించాలని నిర్ణయించినా అమలు కావడం లేదని, పారిశుద్ధ్య నిర్వహణ గాడి తప్పిందని పట్టణవాసులు చెబుతున్నారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పురపాలిక వివరాలు
వార్డులు: 20, జనాభా: 55వేలు
నివాసాలు: 11 వేలకు పైగా
పారిశుద్ధ్య కార్మికులు సుమారు 125 మంది

ప్రత్యేక దృష్టి పెడుతున్నాం

బల్దియాలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. ఎక్కడైనా ఇబ్బంది ఉంటే ప్రజలు నేరుగా మా దృష్టికి తీసుకురావాలి. ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నాం.

-రాజమౌళి, బల్దియా ఛైర్మన్

న్యాయం చేయాలని వైద్యుల నిరసన



సర్వజన ఆస్పత్రిలో ఐఎంఏ ప్రతినిధులు, జూడాలు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: కోల్‌కతాలో వైద్యవిద్యార్థిని హత్యాచార ఘటన జరిగి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం శోచనీయమని ఐఎంఏ సిద్దిపేట శాఖ అధ్యక్షుడు డా.చందర్, ప్రధాన కార్యదర్శి డా.గణేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా జూడాలు చేస్తున్న నిరాహార దీక్షకు మద్దతుగా సిద్దిపేట సర్వజన ఆస్పత్రిలో మంగళవారం జూడాలు, ఐఎంఏ అసోసియేషన్ వైద్యులు నిరసన తెలిపారు. ఘటనపై పశ్చిమ్‌బంగాలో జూనియర్ డాక్టర్లు గత పది రోజులుగా నిరవధిక దీక్షలు చేస్తున్నా అక్కడి ప్రభుత్వం పట్టించుకోకపోవటం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ప్రణీత్, వి.వి.రావు, శ్రీనివాస్, భీమేశ్, వీరన్న, నవీన్, వేణుగోపాల్, అరుణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



విత్తన దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఏవో రాధిక

చిన్నకోడూర్, కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: చిన్నకోడూర్ మండలంలోని పురుగుమందుల, విత్తన దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారిణి రాధిక మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దస్త్రాలు, సరకు నిల్వలు పరిశీలించి మాట్లాడారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొరత లేకుండా చూడాలని దుకాణదారులకు సూచించారు. సాగులో సందేహాలుంటే రైతులు స్థానిక వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. అనంతరం చిన్నకోడూర్ రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె వెంట ఏవో జయంత్‌కుమార్, ఏఈవోలు ఉన్నారు.

ఆమె లేకున్నా నేత్రాలు సజీవం



ప్రియాంక

గజ్వేల్, న్యూస్‌టుడే: తాను చనిపోయినా మరో ఇద్దరికి చూపు ఇవ్వాలన్నది ఆమె ఆశయం. కుటుంబీకులు కూడా అంగీకరించడంతో నేత్రదానం చేశారు. గజ్వేల్‌కు చెందిన బచ్చు ప్రియాంక(25) ప్రసవానంతరం సోమవారం రాత్రి మృతిచెందింది. ఈ క్రమంలోనే లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులు మంగళవారం ఆమె నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

24 నుంచి తెలుగు రాష్ట్రాల శిక్షకులకు తర్ఫీదు

సిద్దిపేట, న్యూస్‌టుడే: సిద్దిపేటలో యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ వేదికగా ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు తెలుగు రాష్ట్రాల్లో వివిధ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థల్లో పని చేస్తున్న శిక్షకులకు శిక్షణ అందించనున్నట్లు రాష్ట్ర కంట్రోలర్ చంద్రశేఖరరాజు, సిద్దిపేట డైరెక్టర్ రాజలింగం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు 200 మందికి మూడు రోజుల పాటు తర్ఫీదు అందిస్తామన్నారు. తొలిసారిగా సిద్దిపేటలో ఈ తరహా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు.

భగీరథ.. లీకేజీతో వృథా



ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా నీటిని సరఫరా చేస్తోంది. కొన్నిచోట్ల లీకేజీలతో విలువైన నీరు వృథా అవుతోంది. హుస్నాబాద్ నుంచి సిద్దిపేట వెళ్లే మార్గంలో పందిల్ల సమీపంలో 'భగీరథ' పైపులైన్ ఎయిర్‌వాల్వ్ లీకైంది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నీరంతా వృథాగా పోయింది. ఎయిర్ వాల్వ్ నుంచి పెద్దఎత్తున నీరు ఎగజిమ్మడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. కొందరు ఎయిర్ వాల్వ్ నుంచి ఎగిసిపడుతున్న నీటివద్ద కార్లను నిలిపి ఉంచారు. విషయం తెలుసుకున్న అధికారులు నీటి సరఫరా నిలిపివేయడంతో వృథా నీటికి అడ్డుకట్ట పడింది.

-న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం

కారు ఢీకొని ద్విచక్రవాహనదారుడి దుర్మరణం



మల్లేశం

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: కొండపాక మండలం దుద్దెడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన దయ్యాల మల్లేశం(40) మృతిచెందినట్లు సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. మల్లేశం తన బైక్‌పై సోమవారం రాత్రి రాజీవ్ రహదారి దాటుతుండగా కారు ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గ్రామస్థులు క్షతగాత్రుడిని 108 అంబులెన్సులో సిద్దిపేటకు, అక్కడి నుంచి వంటిమామిడిలోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఉదయం మృతిచెందాడు. ఆయన భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని సీఐ వెల్లడించారు.

టెలికాం సలహా కమిటీ సభ్యుడిగా శ్రీనివాస్



ఎంపీ రఘునందన్‌రావు నుంచి నియామక పత్రం అందుకుంటూ..

ములుగు, న్యూస్‌టుడే: మెదక్ పార్లమెంటు పరిధి టెలికాం సలహా కమిటీ సభ్యుడిగా ములుగు మండలం కొక్కొండకు చెందిన కమ్మరి శ్రీనివాస్ నియామకం అయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

స్వచ్ఛతకు సహకారం

సిద్దిపేట, న్యూస్‌టుడే: స్వచ్ఛ సిద్దిపేటకు సహకరించాలని బల్దియా కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు. పట్టణంలో ఇంటింటా చెత్త సేకరణలో భాగస్వాములయ్యే పారిశుద్ధ్య వాహనాల చోదకులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఉదయాన్నే వార్డుల్లో చెత్త సేకరణ ఆరంభించాలన్నారు.

అదృశ్యమై.. అనుమానాస్పద స్థితిలో మృతి



యాదగిరి

చేర్యాల(ధూల్మిట్ట): రెండు రోజుల క్రితం అదృశ్యమైన ధూల్మిట్ట మండలం బెక్కల్ గ్రామానికి చెందిన బైరగోని యాదగిరి(48) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. బాధితుల కథనం మేరకు.. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఆయన మంగళవారం కూటిగల్ శివారులో మృతదేహమై కనిపించాడు. మృతదేహం పక్కన మద్యం సీసా, రెండు గ్లాసులు, మంచినీళ్ల సీసా ఉంది. ఘటనాస్థలిని బట్టి అతడితో కలిసి మరో వ్యక్తి మద్యం తాగి ఉంటాడన్న అనుమానం కలుగుతోంది. మృతుడి తలపై లోతైన గాయం ఉంది. అందువల్లే యాదగిరి అక్కడికక్కడే చనిపోయి ఉంటాడని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. చేర్యాల సీఐ శ్రీను, మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ సంఘటనా స్థలానికి చేరుకొని స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. యాదగిరికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని, పోస్టుమార్టం అనంతరమే వివరాలు వెల్లడిస్తామని ఎస్సై వివరించారు.

ఆపన్నహస్తానికి ఎదురుచూపులు

● పది నెలలుగా అందని మిషన్ వాత్సల్య సాయం

న్యూస్‌టుడే, సిద్దిపేట



స్వీకరిస్తున్న దరఖాస్తులు(పాతచిత్రం)

ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న అనాథలు.. తల్లి లేదా తండ్రిని కోల్పోయిన చిన్నారులకు నిరాశే మిగులుతోంది. మిషన్ వాత్సల్య పథకం కింద 18 ఏళ్లలోపు బాలబాలికలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వాలు నిర్ణయించినా.. వివిధ కారణాలతో అంతరాయం ఏర్పడుతోంది. గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు బాలల ఖాతాల్లో ఒకేసారి నగదు జమవగా.. జనవరి నుంచి ప్రక్రియ స్తంభించింది. దాదాపు పది నెలలుగా సాయం అందలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు కేటాయిస్తుండగా.. బడ్జెట్ కేటాయింపు కరవై సమస్య తలెత్తింది.

మిషన్ వాత్సల్య పథకం కింద అధికారులు గతేడాది దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో 179 మంది పిల్లలకు సాయం అందించాలని నిర్ణయించారు. అప్పట్లో 2300 దరఖాస్తులు అందాయి. నెల రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా.. ఎన్నికలు, ఇతరత్రా కారణాలతో సాయం పంపిణీలో జాప్యం ఏర్పడింది. మొత్తంగా ఆర్థిక సంవత్సరం ఆరంభం నుంచి డిసెంబరు వరకు ఒకే దఫాలో బాలబాలికల ఖాతాల్లో సొమ్ము జమ అయింది. మరోవైపు లబ్ధిదారుల్లో మెజార్టీగా అనాథ పిల్లలే ఉండటం గమనార్హం. ఈ ఏడాది ఆరంభం నుంచి అందకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. మరోవైపు అవకాశం లేకున్నా.. ఇప్పటికీ ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు.

గతేడాది నుంచి రూ.4000

2011లో ఐసీపీఎస్ (ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ సర్వీసు)గా సాయం పంపిణీ ఆరంభించారు. 2014 నుంచి సీసీఎస్‌గా రూపాంతరం చెందింది. 2022 నుంచి మిషన్ వాత్సల్యగా పేరు మార్చి అమలు కొనసాగిస్తున్నారు. పథకం ఆరంభంలో రూ.500 ప్రతి నెలా అందించగా.. గతేడాది నుంచి రూ.4 వేలకు పెంచారు. దీంతో జిల్లా బాలల పరిరక్ష విభాగానికి దరఖాస్తులు పెద్దమొత్తంలో అందాయి. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెలా అధికారుల అనుశీలన కొనసాగుతోంది.

నెలల తరబడిగా..

తొలి ప్రాధాన్యంగా అనాథలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన పిల్లలను ఎంపిక చేశారు. గరిష్ఠంగా రెండేళ్ల పాటు ఈ సాయం అందనుంది. మరో ఐదు నెలలు గడిస్తే ఆర్థిక సంవత్సరం కూడా ముగియనుంది. నెలల తరబడి సాయం అందక చదువుకునే విద్యార్థులు అవసరాలు తీర్చుకోలేక అవస్థలు పడుతున్నారు. 18 ఏళ్లు దాటితే సదరు బాలలకు ఆ సాయం నిలిపివేసి వారి స్థానంలో అర్హులైన మరొకరికి అవకాశం కల్పించనున్నారు. ఈ విషయమై జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి రామును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

భాజపా బలోపేతానికి కృషి



భాజపా జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

చిన్నకోడూర్, కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: భాజపా బలోపేతానికి కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిన్నకోడూర్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి పోలింగ్ బూత్‌లో పెద్దఎత్తున పార్టీ సభ్యత్వాలు చేయించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలు ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు సంతోష్‌కుమార్, మహేష్, నాయకులు శ్రీనివాస్, రమేష్, కనకయ్య, రాజేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ..



వెంకటేష్

కుకునూరుపల్లి(కొండపాక గ్రామీణం), న్యూస్‌టుడే: మద్యం మత్తులో పురుగుల మందు తాగి మంగోల్ గ్రామానికి చెందిన బస్వరాజుల వెంకటేష్(31) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. వెంకటేష్ ఈ నెల 13 దసరా పండుగ రోజున రాత్రి మద్యం తాగాడు. అదే మత్తులో కొద్దిసేపటికి పురుగుల మందు తాగాడు. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం ప్రజ్ఞాపూర్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఆయన భార్య రేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. వెంకటేష్‌కు రెండు నెలల బాబు ఉన్నాడు.

ఉపాధ్యాయపర్వం



చిన్నారిని ఆడిస్తున్న అమ్మమ్మ, వివరాలు రాస్తున్న అమ్మ



భార్య వెళ్లగా కుమారుడిని ఎత్తుకున్న తండ్రి

ధ్రువపత్రాల పరిశీలన, కౌన్సెలింగ్‌కు కాబోయే టీచర్లు సిద్దిపేట కలెక్టరేట్‌కు మంగళవారం వచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి వందలాది మంది తరలిరావడంతో కార్యాలయంలో సందడి నెలకొంది. మహిళ అభ్యర్థులు తమ వెంట తీసుకొచ్చిన శిశువులను కుటుంబ సభ్యులు ఎత్తుకోగా వారు కార్యాలయంలో వచ్చిన పని చేసుకున్నారు. – న్యూస్‌టుడే, సిద్దిపేట

ధరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాక, న్యూస్‌టుడే: కూడవెల్లి రామలింగేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం ఆలయ ఈవో పి.విశ్వనాథ శర్మ తెలిపారు. ఈ నెల 10న తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ కూడవెల్లి ఆలయానికి సంబంధించి ధర్మకర్తల మండలి నియామకానికి ప్రకటన ఉత్వర్వులు వెలువరించారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 20 రోజుల్లోపు హైదరాబాద్‌లోని దేవదాయ ధర్మదాయ కమిషనర్‌కు గాని, సంగారెడ్డిలోని సహాయ కమిషనర్‌కు గాని దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

అన్నదాత ఆవేదన

‘ఫార్మాసిటీ’కి మూడు పంటలు పండించే భూములు సేకరించొద్దని వేడుకోలు



డప్పూర్‌లో ఇటీవల ఆందోళన చేస్తున్న రైతులు

ఫార్మాసిటీ ఏర్పాటుకు ప్రణాళిక

• జహీరాబాద్ నిమ్జ్ (జాతీయ ఉత్పాదక పెట్టుబడుల మండలి)కు అనుసంధానం	• సేకరణలో తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాలు
భూములు కోల్పోనున్న రైతులు 1,321	మొత్తం ఎకరాలు 2003
పట్టా స్థలాలు 1096.22 ఎకరాలు	అసైన్డ్ భూములు 907.17 ఎకరాలు
సేకరణకు గెజిట్ విడుదల ఆగస్టు 2024	

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్, న్యాల్‌కల్:

చుట్టూ ఎత్తైన గుట్టలు.. జలపరవళ్లతో వాగులు, చెక్ డ్యాంలు, చెరువులు.. పంటలు పండే భూములు.. జింకలు, నెమళ్లు, వలస పక్షుల సంచారం.. ఉమ్మడి జిల్లాకు తాగునీరందించే మంజీర నది పరీవాహకం ఇది. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిన ప్రాంతం ఇది. 2003 ఎకరాల భూసేకరణ చేపట్టాలని నిర్ణయించారు. దీన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర సరిహద్దులోని మూడు గ్రామాల ప్రజలు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే నారాయణఖేడ్-బీదర్ 161(బి) నాలుగు వరుసల జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతుల నుంచి పరిశ్రమల పేరిట స్థలాలు లాగేసుకుంటే ఊరుకోబోమని చెబుతున్నారు.

ఆందోళనలపై నివేదిస్తాం:

–రాజు, ఆర్డీవో, జహీరాబాద్

ఫార్మాసిటీ భూసేకరణ ప్రక్రియ ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుకు సాగుతుంది. భూములు కోల్పోతున్న రైతులు చేపడుతున్న ఆందోళనలపై ఉన్నతాధికారులకు నివేదించడం జరిగింది.

వాణిజ్య పంటల సాగు

కర్ణాటకలోని బీదర్ జిల్లా కేంద్రానికి సరిహద్దులుగా ఉండే ఈ మూడు గ్రామాల రైతులకు సాగు భూములు జీవనాధారం. చెరుకు, అల్లం, పసుపు, పప్పుదినుసులు, నూనె గింజలు సహా కూరగాయలు, పత్తి ఏడాదికి మూడు పంటలు పండిస్తున్నారు. కూరగాయలను బీదర్, జహీరాబాద్, నారాయణఖేడ్, హైదరాబాద్‌లకు తరలిస్తారు. నారాయణఖేడ్-బీదర్ 161(బి) జాతీయ రహదారి పనులు ప్రారంభం కావడంతో మార్కెట్‌లో రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు పలుకుతున్నాయి. భూమిని సేకరించే ప్రాంతాల్లోని నీటివనరుల ద్వారా మంజీర నదిలోకి నీరు చేరుతుందని.. కలుషితమయ్యే పరిస్థితి తలెత్తుతుందని పర్యావరణవేత్తలు, జీవవైవిధ్య సంరక్షకులు అంటున్నారు.



సేకరించనున్న చెరువు ప్రాంతం

భూమి సేకరించే గ్రామాల పరిధిలో ఉన్నాయివి

చెరువులు	2
వాగులు	5
చెక్ డ్యాంలు	15
బోరుబావులు	150
సాగునీటి బావులు	186



డప్పూర్, మల్గి శివారుల్లో ప్రతిపాదించిన పట్టా భూములు

ఫార్మాసిటీ వద్దు.. పైసలు వద్దూ



మా ఎకరా భూమి ఫార్మాసిటీకి పోతోంది. ప్రభుత్వం ఇచ్చే ఎంతటి పైసలైనా మాకొద్దు. మా గ్రామాలకు ఫార్మాసిటీ వద్దేవద్దు.

– శశికళ, మహిళ రైతు

పదిహేను ఎకరాలు కోల్పోతున్నాం



ఐదుగురం అన్నదమ్ములం. మా 15 ఎకరాల భూమిని సేకరిస్తున్నారు. మా అందరికీ 30 మంది సంతానం. గుంట భూమైనా మిగలడం లేదు. తర్వాత పరిస్థితి దయనీయంగా తయారవుతుంది. – మల్లప్ప, డప్పూర్

న్యాయ పోరాటం చేస్తాం



మూడు గ్రామాల సారవంతమైన భూములను సేకరిస్తామని ప్రకటించారు. వాటిని నమ్ముకున్న వారి నుంచి బలవంతంగా సేకరిస్తే న్యాయ పోరాటం చేస్తాం.

– రవికుమార్, మాజీ సర్పంచి, డప్పూర్




విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

జాతీయ యోగా పోటీలకు ఆకునూరు బాలికలు

చేర్యాల, న్యూస్‌టుడే: సంగారెడ్డిలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచి చేర్యాల మండలం ఆకునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎం.సాత్విక, 7వ తరగతి చదువుతున్న పి.అవంతిక జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని ప్రధానోపాధ్యాయుడు ఐలయ్య, ఉపాధ్యాయ బృందం మంగళవారం అభినందించి, సన్మానించారు. నవంబరు 8 నుంచి అసోంలోని గౌహతిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం.కవిత తెలిపారు. గ్రామానికి చెందిన సందెబోయిన వెంకటేశ్ రూ.8 వేల విలువైన యోగా దుస్తులు విద్యార్థినులకు అందజేశారు. అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్మన్ సైదా, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నింగి.. నేల.. ఒకటై..



ఆకాశంలో మేఘాలు పచ్చని పైర్లను, చెట్లను, గుట్టలను తాకే విధంగా ఉండి ఆహా అనేవిధంగా కనువిందు చేస్తోంది. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ రామప్ప గుడిపై నుంచి కనిపించిన ప్రకృతి రమణీయత చూసేవారిని కట్టిపడేసింది. – న్యూస్‌టుడే, చేగుంట, తూప్రాన్

మళ్లీ వరద... ఆలయం మూసివేత



ఆలయం ముందు ప్రవాహం



రాజగోపురంలో అమ్మవారికి పూజలు

పాపన్నపేట, న్యూస్‌టుడే: సింగూరు నుంచి నీటిని విడుదల చేయడంతో ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద మంగళవారం ప్రవాహం పెరిగింది. తెల్లవారుజామున అర్చకులు మాత్రమే ఆలయంలోకి వెళ్లి అమ్మవారికి అభిషేకం చేపట్టి మూసివేశారు. రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగించారు.

పట్టపగలు ఇంట్లో చోరీ

చేగుంట, వెల్దుర్తి: పట్టపగలు ఇంట్లో చోరీ జరిగిందని మాసాయిపేటకు చెందిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మంగళవారం గ్రామానికి వెళ్లి విచారించారు. గ్రామానికి చెందిన పాపని శ్రీనివాస్ ఆదివారం వ్యవసాయ బోరు వద్దకు వెళ్లాడు. ఆయన భార్య బయటనుంచి గడియపెట్టి ఇంటి దాబాపైకి వెళ్లి పడుకున్నారు. సాయంత్రం శ్రీనివాస్ ఇంటికి రాగా తలుపులు తీసి ఉన్నాయి. లోపల చూడగా రూ.2 లక్షలు కనిపించలేదు. మంగళవారం పోలీసులు ఆధారాలు సేకరించారు. రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్‌ను వివరణ కోరగా విచారిస్తున్నామన్నారు.

రైతును బురిడీ కొట్టించిన వ్యాపారి

హత్నూర, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వ్యాపారి ఓ రైతును మోసం చేసిన ఘటన హత్నూరలో మంగళవారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన రైతు బాలయ్య తెలిపిన ప్రకారం సోమవారం ఓ యువకుడు బియ్యం కొంటారా అని ఇంటికి వచ్చాడు. కర్నూలు సన్నరకం బియ్యం చూపించి, క్వింటాకు రూ.5,600 ధర చెప్పగా 25 కేజీల అయిదు బస్తాలు కొన్నా. ఊరి బయట డీసీఎం వాహనంలో ఉన్నాయని చెప్పి ద్విచక్రవాహనం మీద అయిదు బస్తాలు తీసుకొచ్చి ఇచ్చి, నగదు తీసుకుని వెళ్లిపోయాడు. మంగళవారం బియ్యం బస్తాలు తీసి చూడగా దొడ్డు రకం కనిపించాయి. దీంతో మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. ఒక్కో బస్తాలో అయిదు కిలోల బియ్యం తరుగు వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ప్రకృతి మలచిన పర్యాటకం



గుట్టల మధ్య మహాసముద్రం చెరువు



‘లైట్స్ ఆన్.. స్టార్ట్ కెమెరా.. యాక్షన్’ అని చిత్రీకరణ సందడి హుస్నాబాద్ మండలం ఉమ్మాపూర్‌లోని మహాసముద్రం చెరువు పరిసరాల్లో ఇటీవల చోటుచేసుకుంటోంది. చుట్టూ ఎత్తైన హరిత కొండలు, పక్షుల కిలకిలా రావాలు, వాటి మధ్య నీటిగలగలలు వెరసి ఆకట్టుకుంటోంది. సెలవు రోజుల్లో ప్రకృతి ప్రేమికులు ఇక్కడి వస్తున్నారు. లఘు చిత్రాలు, ప్రీ వెడ్డింగ్, రీల్స్ లాంటివి ఇక్కడ చిత్రీకరిస్తున్నారు. చెరువు పక్కనే ఉన్న గుట్టను స్థావరంగా చేసుకుని సర్దార్ సర్వాయి పాపన్న ఈ ప్రాంతాన్ని గతంలో కొంత కాలం పరిపాలించారు. ఆనవాళ్లు గుట్టపై ఉన్నాయి. భైరవుడి విగ్రహం గుట్టపై ఉంది. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేస్తున్నారు. అక్కడికి వెళ్లే రోడ్డు కొన్నిచోట్ల సరిగా లేదు. మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం

ఏటీసీ.. నైపుణ్యాలకు అవకాశమిచ్చి..

ప్రభుత్వ ఐటీఐలకు మహర్దశ



న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్: ఇది పోటీ ప్రపంచం. ప్రతిభ చూపితేనే అవకాశాలు సొంతమవుతాయి. నైపుణ్యాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం పారిశ్రామిక శిక్షణ సంస్థలను (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఏర్పాటుచేసినా ఆశించిన ఫలితాలు కనిపించని పరిస్థితి. నైపుణ్యాల లేమితో కోర్సు పూర్తిచేసినా చాలా మంది విద్యార్థులు అవకాశాలు దక్కించుకోలేకపోతున్నారు. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న వారే ఎక్కువ. ఐటీఐలను నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్ల (ఏటీసీ) ఏర్పాటుకు సిద్ధమైంది. తాజాగా ఈ నెల 19 వరకు గడువుతో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది.

ఇవీ కోర్సులు: • మ్యాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ • ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫాక్చరింగ్ • ఆర్టీసియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్ • బేసిక్ డిజైనర్ అండ్ వెరిఫైయర్ • అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్ • మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్స్

ఆవరణలోనే కేంద్రాలు

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలన్నింటిలోనూ నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు ప్రభుత్వం ఇప్పటికే టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు ఒక్కో ఐటీఐకి రూ.4.50 కోట్లు మంజూరు చేశారు. వీటితో నూతన భవన సముదాయాలను నిర్మిస్తున్నారు. కళాశాల ఆవరణలో 10వేల చదరపు అడుగుల స్థలంలో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఐదేళ్ల పాటు కోర్సు నిర్వహణ బాధ్యతలను సంస్థ చూసుకుంటుంది. కొత్త యంత్రాలు వస్తాయి. వివిధ కోర్సులతో ఐటీఐతో పాటు శిక్షణ పూర్తి చేసుకోగలుగుతారు.

విద్యార్థులకు మంచి అవకాశం:

– రాజేశ్వరరావు, ప్రిన్సిపల్, ప్రభుత్వ ఐటీఐ, సంగారెడ్డి



కోర్సుతో పాటు నైపుణ్యాల పెంపుతో మంచి అవకాశాలు ఉంటాయి. నైపుణ్య శిక్షణ పూర్తిచేసుకుంటే స్వయం ఉపాధిలోనూ రాణించేందుకు వీలుంటుంది. ఏటీసీలో ప్రవేశాలకు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: వ్యక్తి అసభ్యకరంగా వ్యవహరించాడని మనస్తాపం చెందిన మహిళ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చిన్నశంకరంపేట పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై నారాయణగౌడ్ తెలిపిన వివరాలు... పట్టణానికి చెందిన యాదమ్మ(40) కూలీ పనులు చేసుకుంటూ ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులను పోషిస్తోంది. ఏడేళ్ల క్రితం భర్త మృతి చెందగా, గుడిసెలో ఉంటోంది. పట్టణానికి చెందిన రాములు ఆదివారం యాదమ్మ ఇంటికి వచ్చి ఆమెతో అసభ్యకరంగా వ్యవహరించాడు. దీంతో పరువు పోయిందని మనస్తాపంతో మంగళవారం ఉదయం తన ఇంట్లో ఉరేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు నార్సింగ్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం



శివకుమార్

వికారాబాద్, న్యూస్‌టుడే: అప్పులు పెరిగిపోయి.. తీర్చే మార్గం కానరాక పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ ఎస్సై సత్యనారాయణరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కోట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన లక్కాకుల శివకుమార్(31) స్థానికంగా ఎరువులు, పురుగు మందుల దుకాణం నిర్వహిస్తున్నారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో తెలిసిన వారి నుంచి భారీగా అప్పులు చేశారు. తీర్చే మార్గం కనిపించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. జీవితంపై విరక్తి చెందాడు. మంగళవారం కారులో వస్తూ వికారాబాద్ మండలం మైలార్ దేవరంపల్లి సమీపంలో రోడ్డు పక్కన ఆగాడు. వెంట తెచ్చుకున్న పురుగు మందును కారులోనే తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దారిన వెళ్లే గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి శవాగారానికి తరలించారు. శివకుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


ట్రాక్టర్ ఢీకొని దుర్మరణం



అనిల్ కుమార్

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన ఘటన మంబోజిపల్లి వద్ద మంగళవారం రాత్రి జరిగింది. గ్రామీణ ఠాణా ఎస్ఐ మురళీ తెలిపిన వివరాల ప్రకారం... పాపన్నపేట మండలంలోని యూసుఫ్‌పేటకు చెందిన అనిల్ కుమార్(30) మెదక్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తున్నాడు. విధులు ముగించుకొని గ్రామానికి చెందిన బాల్‌రాజ్‌తో కలిసి స్వగ్రామానికి వెళుతుండగా మంబోజిపల్లి వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అనిల్‌కుమార్ మృతి చెందాడు. బాల్‌రాజ్ చికిత్స పొందుతున్నాడు. అనిల్‌కుమార్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గేదెను ద్విచక్రవాహనం ఢీకొని..



నాగులు

చేగుంట, న్యూస్‌టుడే: ఎదురుగా వచ్చిన గేదెను ద్విచక్రవాహనం ఢీకొనటంతో ఒకరు మృతిచెందిన ఘటన చేగుంట మండలం బోనాల వద్ద సోమవారం రాత్రి జరిగింది. స్థానిక ఎస్సై చైతన్యరెడ్డి తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం పోసాన్‌పల్లికి చెందిన నాగులు(56) వ్యవసాయం చేస్తుంటాడు. శివ్వాయిపల్లిలో బంధువు అంత్యక్రియలకు తన అన్న కుమారుడు మల్లేశంతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. తిరిగి వస్తుండగా.. బోనాల శివారులో అడ్డుగా వచ్చిన గేదెను ఢీకొనటంతో వెనకాల కూర్చున్న నాగులు కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య యాదవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



గురువారెడ్డి

తొగుట, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై తొగుట మండలం గుడికందులకు చెందిన రైతు గోరిట గురువారెడ్డి(42) మృతిచెందాడు. గ్రామస్థులు, మిరుదొడ్డి ఎస్సై పరశురాములు కథనం మేరకు.. గురవారెడ్డికి నాలుగు ఎకరాల పొలం ఉంది. ఇటీవలే మొక్కజొన్న పంట కోశాడు. మళ్లీ ఆ భూమిని పొద్దుతిరుగుడు, మొక్కజొన్న సాగు కోసం సిద్ధం చేశాడు. నీటి తడులు ఇవ్వడానికి మంగళవారం బిందుసేద్యం పరికరాలు అమరుస్తున్నాడు. ఈ క్రమంలోనే భూమిలో చేతికి అందే ఎత్తులో ఉన్న ఎల్టీ, 11 కేవీ విద్యుత్తు తీగలకు బిందుసేద్యం పరికరాలు తగిలి విద్యుదాఘాతానికి గురై గురువారెడ్డి అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలిసి భార్య రమాదేవి, కూతురు ఆకాంక్ష, కొడుకు లోకేష్ రెడ్డి బోరున విలపించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై వెల్లడించారు.

ఆహార వృథాకు వేద్దాం కళ్లెం



న్యూస్‌టుడే, సిద్దిపేట, సంగారెడ్డి మున్సిపాలిటీ, గజ్వేల్:

అన్నం పరబ్రహ్మ స్వరూపం. పేదరికంలో మగ్గే ఎంతో మంది ఒక్కపూట భోజనానికైనా అలమటిస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆహార వృథాను అరికట్టాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపైనా ఉంది. ప్రతి మెతుకు.. ఇంకొకరి బతుకు కోరుతుందనే కోణంలో యోచించాలని సామాజికవేత్తలు చెబుతున్నారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఆ దిశగా చైతన్యం రావాల్సి ఉంది. **నేడు ప్రపంచ ఆహార వృథా నివారణ దినోత్సవం సందర్భంగా** ‘న్యూస్‌టుడే’ ప్రత్యేక కథనం.

జీవనశైలితో మార్పు

జీవనశైలి మారిన ప్రస్తుత తరుణంలో బయట లభించే ఆహారపదార్థాలను ఎక్కువగా ఆరగిస్తున్నారు. వారాంతాలు, ప్రత్యేక రోజుల్లో ఆహార కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. ఎక్కువ శాతం మంది ఆహారాన్ని వృథా చేస్తున్నారు. కొందరు నిర్వాహకులు మాత్రమే సేవాభావాన్ని చాటుతున్నారు. సరైన అవగాహన లేక కొన్ని కుటుంబాల సభ్యులు ఇంటి వద్ద ఆహారాన్ని వృథాగా పారేస్తున్నారు. పల్లెలతో పోల్చితే పట్టణాల్లో ఎక్కువ శాతం ఈ ధోరణి కనిపిస్తోంది. ఆహారం వృథా చేయకుండా దాని విలువను గుర్తించి సద్వినియోగం చేసేందుకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

• సిద్దిపేటలో వాణిజ్య సముదాయాలు 3600 వరకు కొనసాగుతున్నాయి. రెస్టారెంట్లు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, వివిధ రకాల ఆహార తయారీ కేంద్రాల నుంచి నిత్యం 2.50 టన్నుల మేర ఆహార వ్యర్థాలను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ‘బసిల్ ఫౌండేషన్ తెలంగాణ’ సంస్థ సేకరిస్తోంది. బుస్సాపూర్‌లోని ప్లాంటుకు తరలించి గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నారు. రోజులో 1.80 క్యూబిక్ మీటర్ల గ్యాస్ వెలువడుతోంది.

• వేడుకల్లో మిగిలిన ఆహారాన్ని సిద్దిపేట నిరాశ్రయుల కేంద్రం, సర్వజన ఆసుపత్రిలో రోగుల సహాయకులకు పంపిణీ చేస్తున్నారు. ఆలయాల్లో అన్నప్రసాదాల్లో మిగిలినవాటినీ కేంద్రాలకు తరలిస్తున్నారు. అన్నార్థుల ఆకలిని తీర్చడంతో పాటు వృథాకు అడ్డుకట్ట వేసినట్లవుతోంది.


• సిద్దిపేటలోని ఓ రెస్టారెంట్‌లో నిత్యం 50 కిలోలకు పైగా బిర్యానీ, ఇతరత్రా ఆహార ఉత్పత్తులు తయారీ చేసి విక్రయిస్తున్నారు. అందులో దాదాపు 8 కిలోల వరకు వృథాగా మారుతోంది. పలువురు వినియోగదారులు పూర్తిస్థాయిలో తినక అలానే వదిలి పెడుతున్నారు. కొందరు మిగిలిన ఆహారాన్ని ఇంటికి పార్సిల్ తీసుకెళ్తున్నారు. మరికొందరు యాచకులకు అందిస్తున్నారు.



గ్యాస్ ఉత్పత్తి చేసే సిద్దిపేట బుస్సాపూర్ ప్లాంటు

చైతన్యం అందరిలో రావాలి

– జోజి, సామాజిక కార్యకర్త, మాజీ సైనికుడు, సిద్దిపేట



వేడుకలను ప్రణాళికాయుతంగా నిర్వహించాలి. మెనూలో జాగ్రత్తలు తీసుకోవాలి. అనేక రకాలు వడ్డించడంతో సగం వృథాగా మారుతున్నాయి. పారబోతకు ఆస్కారం లేకుండా అవగాహన కల్పించాలి. ఇతర దేశాల్లో హోటళ్లలో అవగాహన కల్పించే సిబ్బంది ఉంటారు. అందరిలో చైతన్యం వస్తే వృథా తగ్గించొచ్చు.

ఆకలి తీర్చడమే.. శరణమయ్యప్పా..



రోడ్డు పక్కన నివసించే వారికి ఆహార పొట్లాలు ఇస్తున్న భక్తులు

రోడ్డు పక్కన రాత్రి సమయంలో ఉండే నిరాశ్రయులకు అయ్యప్ప ఆపద్బాంధవ సేవా సమితి తన వంతు చేయూత అందిస్తోంది. అయ్యప్ప దీక్ష తీసుకున్నా.. లేకున్నా.. సంగారెడ్డి జనప్రియ హోటల్ యజమాని రాజు గురుస్వామి సహకారంతో భోజన ప్యాకెట్లను అందిస్తున్నారు. హోటల్‌లో అమ్ముడు పోగా మిగిలిన తాజా ఆహార పదార్థాలను సభ్యులు ప్యాక్ చేసి కొత్త, పాత బస్టాండ్లు, జిల్లా ప్రభుత్వాసుపత్రి ప్రాంతాల్లో రోడ్డు పక్కన నివసిస్తున్న వారికి అందిస్తున్నారు. ఆకలి తీర్చడాన్ని ఆధ్యాత్మిక సేవగా భావిస్తున్నామన్నారు.

ఇలా చేద్దాం

• ఆహారాన్ని పారేయకుండా ఇతరులకు ఇచ్చే అలవాటు చేసుకోవాలి.
• స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు సామాజిక బాధ్యత నిర్వర్తించాలి.
• పాఠశాలలు, వసతిగృహాల్లో వృథా అవుతోంది. నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి.
• వేడుకల్లో భోజనాల అంచనా ముందుచూపుతో ఉండాలి.
• పోషకాల రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

బైకు సీటు కింద పాము.. తప్పిన ముప్పు



దోమ, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని ఓ వ్యక్తి మెకానిక్ దగ్గరకు తీసుకెళ్లాడు. ఆ బండి సీటులోంచి నాగుపాము బయటికి రావడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. దోమ మండలం బుద్లాపూర్‌లోని ఈ ఘటన చోటు చేసుకుంది. నరేష్‌కు స్థానికంగా బైక్ మెకానిక్ షాపు ఉంది. మంగళవారం ఓ వ్యక్తి తన బైక్ నడవడం లేదని ఆయన దగ్గరకు తీసుకువెళ్లాడు. బైక్‌సీటు తొలగించే క్రమంలో నరేష్‌కు సీటుకింద నాగుపాము కన్పించింది. దీంతో ఒక్కసారిగా ఉలిక్కిపడి వెనక్కి తప్పుకొన్నాడు. సరిగ్గా అదే సమయంలో కుల్కచర్ల మండలానికి చెందిన శ్రీనివాస్ వెళ్తున్నాడు. అతడిని పాములు పట్టే అలవాటుంది. పది నిమిషాలు శ్రమించి దాన్ని బయటకు తీశారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	126–00	డ్రెస్డ్	215–00
రిటైల్	148–00	స్కిన్‌లెస్	244–00

సీఎం సహాయనిధి పేదలకు వరం: ఎమ్మెల్సీ


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న యాదవరెడ్డి

గజ్వేల్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన గజ్వేల్‌లోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొండపాక మండలం దుద్దెడకు చెందిన నలుగురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స కోసం ఖర్చుచేసి ఆర్థిక ఇబ్బందుల్లో ఉండకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకం అమలు చేస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొండపాక మండలం భారాస అధ్యక్షులు నూనెకుమార్ యాదవ్, కనకయ్య, సాంబయ్య, నాగరాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మైనంపల్లి ప్రత్యేక పూజలు

సిద్దిపేట టౌన్: పట్టణంలోని 14వ వార్డు వడ్డెరకాలనీలో శక్తియూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గామాత నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయన వెంట సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గ అధ్యక్షుడు పూజల హరికృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, అత్తూఇమామ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సరైన యాజమాన్యంతోనే ఎలుకల నివారణ

సిద్దిపేట అర్బన్: తగు యాజమాన్య పద్ధతులు పాటించి ఎలుకల బారి నుంచి వరిపైరును కాపాడుకోవచ్చని ఏవో శ్రీనాథ్ సూచించారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో మంగళవారం వరి పొలాలను పరిశీలించారు. వరిని ఎలుకలు ధ్వంసం చేస్తుంటే జింక్ పాస్ఫేట్‌ను నూకలు, నూనెలో కలిసి ఎలుక సంచరించే ప్రాంతంలో పెడితే వాటిని తిని చనిపోతాయని తెలిపారు.

కరెంటు కష్టాలు తీరేదెన్నడో?

వేలాడే తీగలు.. ఒరిగిన స్తంభాలతో ప్రజల ఆందోళన

మండలంలో రైతులు:	13,781
సాగు విస్తీర్ణం:	25,154
33/॥ కేవీ ఉపకేంద్రాలు:	7
హెచ్‌టీ కనెక్షన్లు:	15

న్యూస్‌టుడే, మిరుదొడ్డి: మెట్ట ప్రాంతాల్లో అధిక విస్తీర్ణం బోరు బావులతోనే సాగవుతోంది. ఈ నేపథ్యంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత శాఖ అధికారులపై ఉంది. చాలా ప్రాంతాల్లో విద్యుత్తు తీగలను సరిచేయకపోవడం, నియంత్రికలు మరమ్మతులకు గురవడంతో సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. సమస్యను విద్యుత్తు సిబ్బందికి చెప్పినా స్పందించకపోవడంతో రైతులే స్వయంగా మరమ్మతులు చేపడుతూ ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. మిరుదొడ్డి మండలంలో అస్తవ్యస్తంగా మారిన విద్యుత్తు సరఫరాపై కథనం..

శంకుస్థాపనతో సరిపెట్టారు

ఉమ్మడి మిరుదొడ్డి మండలంలోని 20 గ్రామాల పరిధిలోని రైతులు యాసంగి పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. అవసరమైన విద్యుత్తు సరఫరాకు మండలంలో మిరుదొడ్డి, పెద్దచెప్యాల, అందె, కొండాపూర్, ఖాజీపూర్, వీరారెడ్డిపల్లి, కాసులాబాద్ గ్రామాల్లో 33/11 కేవీ ఉపకేంద్రాలు ఉన్నాయి. గృహావసరాలకు, చిన్న పరిశ్రమలకు విద్యుత్తు కొరత లేకుండా ధర్మారం-లక్ష్మీనగర్ గ్రామ శివారులో 33/11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రానికి రెండేళ్ల కిందట శంకుస్థాపన చేసినా నేటికి పనులు ప్రారంభం కాలేదు.


రుద్రారంలో కంచెలేని నియంత్రిక


ఖాజీపూర్‌లో స్తంభం దుస్థితి

ప్రమాదాల నివారణకు చర్యలు:

మండలంలో విద్యుత్తు ప్రమాదాలు, సరఫరా నష్టాలను తగ్గించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. విద్యుత్తు స్తంభాల ఏర్పాటు, కాలం చెల్లిన తీగల స్థానంలో కొత్తవాటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ఉపకేంద్రాల వారీగా విద్యుత్తు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. – శ్రీకాంత్, విద్యుత్తు శాఖ, ఏఈ, మిరుదొడ్డి

చేతికందే ఎత్తులోనే..

మిరుదొడ్డి మండలం లక్ష్మీనగర్, కొండాపూర్, మల్లుపల్లి, రుద్రారం, ఖాజీపూర్, భూంపల్లి, మిరుదొడ్డి గ్రామాల్లో పొలాల వద్ద చేతికందే ఎత్తులోనే కరెంటు తీగ వేలాడుతున్నాయి. ఖాజీపూర్, లింగుపల్లి, మిరుదొడ్డి గ్రామాల్లో ఇళ్ల సమీపంలోనూ అలాగే ఉన్నాయి. మల్లుపల్లి, కాసులాబాద్, ఆరెపల్లి, మోతె, అక్బర్‌పేట గ్రామాల్లో విద్యుత్తు నియంత్రికల దిమ్మెలు శిథిలమయ్యాయి. పలు గ్రామాల్లో ఇనుపచువ్వలు తేలి, స్తంభాలు శిథిలమయ్యాయి.

న్యూస్‌టుడే, తొగుట:

? లింగంపేట స్టేజి నుంచి తుక్కాపూర్ చౌరస్తా వరకు కాన్గల్ తారు రోడ్డు గుంతలు పడి ఇబ్బందిగా మారింది. వెంటనే మరమ్మతులు చేయించాలి. – చందు, కాన్గల్, తొగుట

✓ కాన్గల్ రహదారి మరమ్మతులకు రూ.90లక్షల నిధులు మంజూరయ్యాయి. టెండర్లు పూర్తికాగానే పనులు చేపడతాం. – రామకృష్ణ రెడ్డి, ఏఈ(పీఆర్), తొగుట

'ఉపాధి హామీ'లో పరిశోధనలకు డాక్టరేట్


పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న చందన

వర్గల్, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో రాష్ట్రంలో భాగంగా ఉపాధి కల్పన, గ్రామీణాభివృద్ధిపై రంగారెడ్డి జిల్లా పరిధిలో చేసిన పరిశోధనలకుగాను డా.ఎ.కె. చందనకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆమె వర్గల్‌లోని మహాత్మా జ్యోతిబా పులే వెనుకబడిన తరగతుల డిగ్రీ కళాశాలలో రాజనీతిశాస్త్రం అధ్యాపకురాలిగా పనిచేస్తోంది. కళాశాల ప్రిన్సిపల్ భాస్కరరావు, అధ్యాపకులు ఆమెను అభినందించారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన అత్తూఇమామ్


మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న అత్తూఇమామ్

సిద్దిపేట టౌన్: పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు అత్తూఇమామ్, టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. సిద్దిపేటలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని, సూచించారు. నాయకులు గయాజుద్దీన్, నజ్జు, మధు, అనిల్ తదితరులు ఉన్నారు.

మార్కెట్ యార్డుకు స్థలం కేటాయించాలని వినతి

చేర్యాల, న్యూస్‌టుడే: కొమురవెల్లి మండలం ఐనాపూర్‌లోని ప్రభుత్వ భూమిని వ్యవసాయ విపణికి కేటాయించాలని, సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కొమురవెల్లి తహసీల్దారు లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఆ ప్రాంతంలో గత ఆరేళ్లుగా అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నారని, అందువల్ల ఆ స్థలాన్ని విపణి అవసరాలకు పూర్తిస్థాయిలో వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తేలు ఇస్తారి, సాయిలు, యాదగిరి, ఎల్లయ్య, చంద్రయ్య, గోరేమియా పాల్గొన్నారు.

'మత్స్యకారులపై చిన్నచూపు తగదు'

సిద్దిపేట టౌన్: రాష్ట్రంలో మత్స్యకారులపై కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని భారాస నాయకుడు, మత్స్యకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్‌ముదిరాజ్ అన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. చెరువులు, కుంటలు నిండుకున్నా ఇప్పటివరకు చేపపిల్లలు పంపిణీ చేయకపోవటం శోచనీయమన్నారు. భారాస ప్రభుత్వ హయాంలో మత్స్యకారులు, ముదిరాజ్‌లకు పెద్ద పీట వేశారని గుర్తు చేశారు. నాయకులు కీసరి పాపయ్యముదిరాజ్, ప్రశాంత్, తదితరులున్నారు.

వైద్యులపై దాడులు అరికట్టాలి


గజ్వేల్ ప్రభుత్వాస్పత్రి ఎదుట వైద్యుల దీక్ష

గజ్వేల్, న్యూస్‌టుడే: వైద్యులపై దాడులు అరికట్టడంతో పాటు కలకత్తాలో మహిళా వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడిన దోషులను వెంటనే శిక్షించాలని వైద్యులు డిమాండ్ చేశారు. ఐఎంఏ పిలుపు మేరకు గజ్వేల్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గజ్వేల్‌లోని ప్రభుత్వాస్పత్రి ముందు ఒకరోజు దీక్ష చేపట్టారు. హైదరాబాద్ కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి వైద్యులు వారికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు నరేశ్‌బాబు, నాగమునయ్య తదితరులున్నారు.

ఆలయాలకు రక్షణ అవసరం


మాట్లాడుతున్న హిందూసంఘాల ప్రతినిధులు, అయ్యప్ప మాలాధారులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్‌లో జరిగిన ఆలయ ఘటన నేపథ్యంలో జిల్లాలోని ఆలయాలన్నింటికి రక్షణ కల్పించాలని పట్టణంలోని హిందూ సంఘాలు, అయ్యప్ప మాలాధారులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఏసీపీ కార్యాలయం, వన్‌టౌన్ సీఐ వాసుదేవరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భిన్నత్వంలో ఏకత్వంలా కలిసి మెలిసి ఉండే రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు జరగటం దురదృష్టకరమన్నారు. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులకు ఊతమిచ్చేలా 'ఉపాధి' పనులు


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్య

దుబ్బాక, న్యూస్‌టుడే: గ్రామాల్లో రైతులు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్య తెలిపారు. మంగళవారం దుబ్బాక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి గ్రామ పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 'ఉపాధి'లో భాగంగా పండ్ల తోటలు, కోళ్లఫారాల షెడ్లు, పశువుల పాకల నిర్మాణం, నీటి సంరక్షణ చర్యలు వంటివి రైతులకు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న 2, 3 రోజుల్లో ప్రతి గ్రామంలో రైతుల పొలాల్లో పాంపాండ్లను ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు సమన్వయంతో పనిచేస్తూ, ముందుకు సాగాలన్నారు. అంతకుముందు అప్పనపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధరకు విక్రయించాలని కోరారు. సమావేశంలో ఏపీడీ శివాజీ, ఎంపీడీవో భాస్కరశర్మ, ఎంపీవో నరేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్యతో క్రీడల్లోనూ రాణించవచ్చు


క్రీడాకారులకు బ్లాక్‌బెల్టులు అందిస్తున్న అదనపు డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేట టౌన్: ఆత్మరక్షణకు కరాటే లాంటి విద్యలు ఎంతో అవసరమని అదనపు డీసీపీ మల్లారెడ్డి అన్నారు. విద్యార్థి దశ నుంచే ఆత్మరక్షణ విద్యలు నేర్చుకుంటే భవిష్యత్తులో క్రీడల్లో సైతం రాణించగలుగుతారన్నారు. జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన బెల్టు పోటీల్లో సిద్దిపేటకు చెందిన 14 మంది క్రీడాకారులు బ్లాక్ బెల్టులు సాధించారు. ఈ మేరకు పోలీస్ కమిషనరేట్‌లో అదనపు డీసీపీ మల్లారెడ్డి చేతులమీదుగా మంగళవారం వారికి క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చదువుతో పాటు శారీరక దృఢత్వానికి సంబంధించి ఆటలు, కరాటే, సంగీతం, సాహిత్యం లాంటి రంగాల్లో ప్రావీణ్యం అవసరమన్నారు. జపాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర చీఫ్ ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్, జిల్లా చీఫ్ రాచకొండ ఆంజనేయులు, జోనల్ చీఫ్ భాగ్యరాజ్, బ్లాక్‌బెల్టు మాస్టర్స్ ప్రవళిక, తేజశ్విన్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలి

దుబ్బాక, న్యూస్‌టుడే: దుబ్బాక పురపాలికలోని పలు వార్డుల్లో రైతులు ధాన్యాన్ని ఆరబోసి ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే కల్లాలు శుభ్రపరిచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని భాజపా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్తు తిరుమల్‌రెడ్డి అన్నారు. పురపాలికలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరుతూ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పుర కార్యాలయంలో కమిషనర్ రమేశ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాజపా నాయకులు సుంకోజి ప్రవీణ్, నిమ్మ యాదయ్య, సంజీవరెడ్డి, యాదవరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని హుస్నాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు బొలిశెట్టి శివయ్య అన్నారు. మంగళవారం అక్కన్నపేట మండలంలోని మల్లంపల్లి, అక్కన్నపేట, మైసమ్మవాగుతండా, కుందన్‌వానిపల్లి, బొడిగపల్లి, గుడాటిపల్లి గ్రామాల్లో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. మాజీ సర్పంచులు ముత్యాల సంజీవరెడ్డి, బద్దం రాజిరెడ్డి, సొసైటీ సీఈవో తిరుమల, ఆర్‌ఐ యాదగిరి, ధరావత్ తిరుపతినాయక్ పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాం సేవలు మరువలేనివి


గౌరవెల్లి పాఠశాలలో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని అక్కన్నపేట మండలం గౌరవెల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి కలాం అందించిన సేవలు మరువలేనివన్నారు. ప్రధానోపాధ్యాయురాలు అనంతుల జ్యోతి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మిరుదొడ్డి: అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి, మిరుదొడ్డి మండలం కాసులాబాద్ ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం అబ్దుల్‌కలాం జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా మండలాల టీపీటీఎఫ్ మండలాధ్యక్షులు రామచంద్రం, శ్రీనివాస్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విభాగిని సమం.. ఆదమరిస్తే ప్రమాదం

రహదారికి ఇరువైపులా వాహనాలు సాఫీగా వెళ్లేందుకు విభాగిని ఎంతగానో తోడ్పడుతుంది. కానీ కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లిలో రాజీవ్ రహదారి నుంచి ఐనాపూర్ వెళ్లేదారిలో నిర్మించిన విభాగిని రోడ్డుకు సమాంతరంగా మారడంతో కొందరు రోడ్డు దాటుతూ తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో ఇక్కడ మలుపు ఉండడంతో అధికారులు విభాగిని నిర్మించారు. కాలక్రమేణా రోడ్డుపై రెండు, మూడుసార్లు తారు వేయడంతో విభాగిని రోడ్డుకు సమాంతరంగా మారింది. ద్విచక్ర వాహనదారులు, బాటసారులు విభాగిని పైనుంచి దాటుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా విభాగిని ఎత్తు పెంచాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయమై దుద్దెడ టోల్‌గేట్ మేనేజర్ అశోక్‌రెడ్డిని వివరణ కోరగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. **- న్యూస్‌టుడే, కొండపాక గ్రామీణం**

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు: ఏసీపీ


దౌల్తాబాద్‌లో మాట్లాడుతున్న గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: కులమత విభేదాలు లేకుండా సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలని, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తప్పవని సిద్దిపేట ఏసీపీ మధు హెచ్చరించారు. సిద్దిపేటలోని వన్‌టౌన్ ఠాణా ఆవరణలో మంగళవారం మత పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ వాసుదేవరావుతో కలిసి వారికి పలు సూచనలు చేశారు. ఏదైనా ఘటన జరిగితే మతపెద్దలు, కులపెద్దలు ముందుకొచ్చి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వివిధ మత పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్: దౌల్తాబాద్‌లో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో మంగళవారం గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి పాల్గొని మాట్లాడారు. మతాల పేరుతో గొడవలు సృష్టించే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తొగుట సీఐ లతీఫ్, ఎస్‌ఐ ప్రేమ్‌దీప్, మతపెద్దలు పాల్గొన్నారు.

గజ్వేల్ గ్రామీణ: యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని గజ్వేల్ అదనపు సీఐ ముత్యం రాజు అన్నారు. స్థానిక ప్రగతి కళాశాలలో ఆయన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

రాయపోల్: రాయపోల్ ఠాణాలో ఏఎస్‌ఐ దేవయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయా పార్టీల నాయకులున్నారు.

జూదం ఆడుతూ పట్టుబడిన 9 మందిపై కేసు

చిన్నకోడూరు, న్యూస్‌టుడే: జూదం ఆడుతుండగా పట్టుబడిన 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చిన్నకోడూరు ఎస్సై బాలకృష్ణ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. గోనెపల్లి శివారులో మంగళవారం సాయంత్రం కొంతమంది వ్యక్తులు జూదం ఆడుతున్నారు. ఈ నేపథ్యంలో నమ్మదగిన సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు కలిసి తనిఖీలు నిర్వహించారు. 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ.3,230 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు, మూడు చరవాణులను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: కొండపాక ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఆంగ్లం, హిందీ ఉపాధ్యాయ పోస్టులకు గంటల ప్రతిపాదికన పనిచేయుటకు ఈనెల 18న నిర్వహించే ఇంటర్వ్యూకు ఆసక్తిగల అభ్యర్థులు హాజరు కావాలని ప్రిన్సిపల్ యజ్ఞశ్రీ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడారు. గతంలో పనిచేసిన వారికి తగిన ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

గజ్వేల్ గ్రామీణ: గజ్వేల్‌లోని ఆదర్శ పాఠశాలలో ఆంగ్లం బోధించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ జుట్టిక వనిస ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 19న పాఠశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆమె కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గజ్వేల్, న్యూస్‌టుడే: అనారోగ్యంతో ఇంటి వద్ద చికిత్స పొందుతున్న పీసీసీ మాజీ సంయుక్త కార్యదర్శి షేక్ జాఫరుల్లాను డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆరోగ్యంపై వాకబు చేశారు. పార్టీ తరుపున అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. గజ్వేల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ సర్దార్‌ఖాన్ తదితరులున్నారు.

సభ్యత్వ నమోదుకు విశేష స్పందన: భాజపా

బెజ్జంకి, న్యూస్‌టుడే: భాజపా చేపట్టిన సభ్యత్వ నమోదుకు అన్నివర్గాల నుంచి స్పందన లభిస్తోందని పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం వీరాపూర్‌లో సభ్యత్వ నమోదు చేపట్టి మాట్లాడారు. అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున సభ్యత్వాలు చేపడుతూ మండలాన్ని ముందంజలో నిలపాలని తెలిపారు. ప్రధాని మోదీ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. భాజపా మండలాధ్యక్షుడు రాజు, నాయకులు అజయ్‌వర్మ, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

'వర్గీకరణ పూర్తయ్యేవరకు నోటిఫికేషన్లు ఇవ్వొద్దు'

సిద్దిపేట అర్బన్: ఎస్సీ వర్గీకరణ పూర్తయ్యేవరకు ప్రభుత్వం ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్లు ఇవ్వరాదని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కొలిమి మల్లేశం డిమాండ్ చేశారు. సిద్దిపేటలో మంగళవారం ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ నియామకాల్లో వర్గీకరణ అమలు చేయాలన్నారు. బుధవారం నిజామాబాద్‌లో నిర్వహించే సంఘం రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

సానుకూల దృక్పథంతో సత్ఫలితాలు

సిద్దిపేట: మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, సిబ్బందికి 'ఒత్తిడిని ఎదుర్కోవడం ఎలా' అనే అంశంపై స్ఫూర్తి కౌన్సెలింగ్ సెంటర్(ఆంగ్ల విభాగం) సహకారంతో మంగళవారం అవగాహన కల్పించారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు, కౌన్సెలర్ మామిడాల శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఒత్తిడి భాగమని, ప్రతి ఐదుగురిలో ఒకరు మానసిక జబ్బుల బారినపడుతున్నట్లు తెలిపారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డా.అయోధ్యరెడ్డి, వివిధ విభాగాల ప్రతినిధులు గోపాలసుదర్శనం, ఉమా మహేశ్వరి, తదితరులు ఉన్నారు.

అప్రమత్తతతోనే గాలికుంటు వ్యాధి నివారణ

గజ్వేల్ గ్రామీణ: పశువుల్లో గాలికుంటు వ్యాధిపై అప్రమత్తత అవసరమని పశుసంవర్ధక శాఖ గజ్వేల్ ఏడీ రమేష్‌బాబు అన్నారు. మంగళవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని రాజిరెడ్డిపల్లిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 14 వరకు గ్రామాల్లో టీకా కార్యక్రమం కొనసాగుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ జకియొద్దీన్, స్థానిక కౌన్సిలర్ బాలమణి తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్‌లో చిరు దుకాణాల తొలగింపు


పనులు పరిశీలిస్తున్న ఏసీపీ సతీశ్, కమిషనర్ మల్లికార్జున్, ఎస్‌ఐ మహేశ్

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్ పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో విద్యుత్తు ఉపకేంద్రం సమీపంలో చిరు వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేసుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు కొరడా ఝుళిపించారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే సమాచారంపై మంగళవారం ఏసీపీ వాసాల సతీశ్, పుర కమిషనర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో రహదారికి ఇరువైపుల ఉన్న దాదాపు ఆరు చిరు దుకాణాలను డోజర్ ట్రాక్టర్‌తో తొలగించారు. అక్కడ ఉన్న దుకాణ నిర్వాహకులకు పోలీసు అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ ప్రాంతంలో మళ్లీ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ శ్రీను, ఎస్‌ఐ తోట మహేశ్‌తోపాటు పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వేపై ఒత్తిడి తేవద్దు

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వే చేయాలని తమపై ప్రభుత్వం ఒత్తిడి తేవద్దని పొరుగు సేవకులుగా పనిచేస్తున్న ఏఈవోలు కోరారు. మంగళవారం జిల్లా వ్యవసాయాధికారిణి రాధికను కలిసి విన్నవించారు.

అనారోగ్యంతో వలస కూలీ మృతి

కొండపాక గ్రామీణం: అనారోగ్యంతో వలస కూలీ మృతిచెందిన ఘటన కొండపాక మండలం సిరిసినగండ్లలో జరిగింది. మంగళవారం సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలు.. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన సురేందర్(49) పదిహేను రోజుల కిందట సిరిసినగండ్లలోని వెంకటేశ్వర కోళ్లఫారంలో కూలీగా చేరాడు. సోమవారం తీవ్ర అస్వస్థకు గురవడంతో యాజమాన్యం, తోటి సిబ్బంది చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. మృతుని కుమారుడు బిమల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు మిరుదొడ్డి ఎస్‌ఐ పరుశురాములు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిరుదొడ్డి మండలం అందె గ్రామ శివారులోంచి అక్రమంగా లారీలో ఇసుకను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో గస్తీ నిర్వహించి పట్టుకున్నామన్నారు. ఈ మేరకు లారీ యజమాని కూర అనిల్‌కుమార్, లారీ డ్రైవర్ చింటుపై కేసు నమోదు చేసి, లారీని ఠాణాకు తరలించామని తెలిపారు.

పోగొట్టుకున్న చేతిసంచి అందజేత

చేర్యాల, న్యూస్‌టుడే: చేర్యాల ఠాణాలో బ్లూకోర్ట్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్.సుభాష్, ఆర్.రవిలకు స్థానిక బస్టాండు ఆవరణలో ఓ చేతి సంచి దొరికింది. అందులో రూ.3వేల నగదుతో పాటు రెండు చరవాణులు ఉన్నాయి. దానిలోని చిరునామా ఆధారంగా ఖమ్మం పట్టణానికి చెందిన మురారి రవికి చెందినదని గుర్తించారు. బాధితుడికి సమాచారం ఇవ్వగా మంగళవారం స్టేషన్‌కు వచ్చి తీసుకున్నారని కానిస్టేబుళ్లు తెలిపారు.